సాక్షి
మెదక్

గురువారం । 21 । ఆగస్టు । 2025



హైదరాబాద్‌కు తాగునీరెట్లా?

సింగూరును ఖాళీ చేస్తే హైదరాబాద్‌కు తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయం ఎలా అనే అంశం తెరపైకి వస్తోంది. వివరాలు 8లో ▸



'నానో' ప్రత్యామ్నాయం

నానో యూరియాతో అధిక లాభాలున్నాయని వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. వివరాలు 8లో ▸



విష జ్వరాలతో విలవిల

నర్సాపూర్ మున్సిపాలిటీతో పాటు గ్రామాల్లో దోమలు పెరిగి ప్రజలు విష జ్వరాలతో సతమతమవుతున్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా బుధవారం పార్టీ కార్యాలయంలో నాయకులు నివాళులర్పించారు. డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశ్, నాయకులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్లు మంజూరు చేయండి

మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి



రామాయంపేట(మెదక్): మెదక్ నియోజకవర్గ పరిధిలో విద్యుత్ కోతల నివారణకు అదనంగా సబ్‌స్టేషన్లు మంజూరు చేయాలని మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. పాపన్న పేట మండలం యూసూఫ్‌పేట, హవేళిఘణాపూర్ మండలం బ్యాతోల్, మెదక్, రామాయంపేట మున్సిపాలిటీల పరిధిలో అదనంగా 33/11 కేవీ సబ్‌స్టేషన్లు అత్యవసరమని అన్నారు. ఇటీవల విద్యుత్ కోతలు తీవ్రతరం అవుతున్నందున ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈమేరకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు లేఖ రాశారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి



మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

పాపన్నపేట(మెదక్): ప్రభుత్వం వెంటనే సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీపీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు తాళ్ల శ్రీనివాస్, మండల శాఖ అధ్యక్షుడు పంతులు రాజు డిమాండ్ చేశారు. బుధవారం పాపన్నపేట ఉన్నత పాఠశాలలో సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పింఛన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ గురునాథ్, హెచ్ఎం మహేశ్వర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వెంకట్‌రాంరెడ్డి, అంజనాచారి, టీచర్లు వెంకటేశం, అంజాగౌడ్, భట్టు నాగరాజు, వేణుగోపాల్, ప్రవీణ్, శ్రీహరి, నింగప్ప, మోహన్‌రావు, కృష్ణకాంత్, రమేష్, ఇందిర, రజిత పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టాలి: డీఎల్‌పీఓ

పెద్దశంకరంపేట(మెదక్): గ్రామాల్లో మురుగు కాల్వలను వెంటనే శుభ్రపర్చాలని, దోమలు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు డీఎల్‌పీఓ సురేశ్‌బాబు సూచించారు. బుధవారం పెద్దశంకరంపేట, కట్టెల వెంకటాపూర్, ఇసుకపాయ తండాలలో ఆయన పర్యటించారు. రికార్డులు పరిశీలించి, సిబ్బందికి సూచనలిచ్చారు. అనంతరం తండాలోని పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనం, విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ షాకీర్‌అలీ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



చిట్కుల్ వంతెనను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ ఎల్లయ్య తదితరులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): భారీ వర్షాల నేపథ్యంలో చెరువులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య సూచించారు. బుధవారం మండల పరిధిలోని చిట్కుల్ శివారులో గల పాత వంతెనపై ప్రవహిస్తున్న మంజీరా నదిని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిట్కుల్ వంతెన వద్ద ప్రస్తుత పరిస్థితులు ప్రశాంతంగానే ఉన్నాయన్నారు. అధికారులు పాత వంతెన వైపు వెళ్లకుండా చర్యలు చేపట్టారని తెలిపారు. రైతులు, ఆలయానికి వచ్చే భక్తులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ ప్రశాంత్, ఆర్ఐ సునీల్‌సింగ్ తదితరులు ఉన్నారు.



మంజీరా.. బిరబిరా

మంజీరా వరద ప్రవాహం వారం రోజులుగా కొనసాగుతూనే ఉంది. బుధవారం ఘనపురం ఆనకట్టపై నుంచి 50 వేల క్యూసెక్కుల నీరు దిగువకు పారుతోంది. దుర్గమ్మ ఆలయం ఇంకా జల దిగ్బంధంలోనే చిక్కుకుంది. – పాపన్నపేట(మెదక్)



జల సవ్వడి.. జన సందడి

భారీ వర్షాలకు నీటి వనరులు జలకళను సంతరించుకున్నాయి. రేగోడ్‌-అల్లాదుర్గం రోడ్డు పక్కనే ఉన్న జగిర్యాల చెరువు నిండి రోడ్డుపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సందర్శకులు సందడి చేస్తున్నారు. సెల్ఫీలు దిగుతూ సంబరపడుతున్నారు. అధికారులు సైతం సందర్శించి చెరువు, నీటి ఉధృతిని పరిశీలిస్తున్నారు. – రేగోడ్(మెదక్)

నామినేటెడ్‌కు వేళాయే!

పదిహేను రోజుల్లో పదవుల భర్తీ!

- జిల్లాలో ఆరు మార్కెట్ కమిటీలు
- ఆశావహుల పేర్లు ఖరారు..
- స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే ప్రకటన

జిల్లాలోని పలు నామినేటెడ్ పదవుల భర్తీకి కసరత్తు పూర్తయినట్లు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే పదవుల భర్తీ చేసేందుకు అధికార పార్టీ నేతలు సన్నద్ధం అవుతున్నారు. ఇప్పటికే పలువురు సీనియర్ నేతల పేర్లు ఖరారు చేసినట్లు సమాచారం. మరో 15 రోజుల్లో పదవుల భర్తీ ప్రక్రియ పూర్తవుతుందని జిల్లాకు చెందిన ఓ సీనియర్ నేత పేర్కొన్నారు. – మెదక్‌జోన్



జిల్లాలో మెదక్, రామాయంపేట, పాపన్నపేట, నర్సాపూర్, చేగుంటతో పాటు నూతనంగా ఏర్పాటైన తూప్రాన్‌తో కలిపి మొత్తం ఆరు మార్కెట్ కమిటీలు ఉన్నాయి. అలాగే ఏడుపాయల దేవస్థానం పాలకమండలి ఉంది. మార్కెట్ కమిటీల పదవీకాలం ముగిసి రెండేళ్లు పూర్తికాగా, ఏడుపాయల పాలకమండలి పదవి ముగిసి ఏడాది గడిచింది. కాగా మార్కెట్ కమిటీలో చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు 10 మంది డైరెక్టర్లు, ఇద్దరు లైసెన్స్ ట్రేడర్స్ సభ్యులు, జిల్లా మార్కెటింగ్ అధికారి, సొసైటీ చైర్మన్, అగ్రికల్చర్ అధికారి, మున్సిపల్ ప రిధి అయితే మున్సిపల్ చైర్మన్, గ్రామీణ ప్రాంతం అయితే సర్పంచ్ సభ్యులుగా ఉంటారు. మొత్తం 18 మంది పాలకమండలిలో ఉంటారు.

ఈఓ ఆధ్వర్యంలోనే కార్యక్రమాలు..

రాష్ట్రంలోనే ప్రసిద్ధిచెందిన ఏడుపాయల దేవస్థానానికి ఏడాదిగా పాలకమండలి లేకుండానే ఈఓ ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఆలయంలో మొత్తం ధర్మకర్తలు 14 మంది ఉంటారు. ఇందులో ఒక చైర్మన్‌తో పాటు 13 మంది సభ్యులు కొనసాగుతారు. వారిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలతో పాటు ఉన్నతవర్గాలకు చెందిన వారు సైతం సభ్యులుగా ఉంటారు. కాగా చైర్మన్ పదవిని పాపన్నపేట మండలానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేతలు గోవింద్‌నాయక్, శ్రీకాంతప్ప, సతీశ్, శ్రీకాంత్‌రెడ్డి, మల్లప్ప ఆశిస్తున్నారు.

- ➡ మెదక్ మార్కెట్ కమిటీ పదవీకాలం 2023 సెప్టెంబర్ 23తో ముగిసింది. ఇది బీసీ రిజర్వేషన్ కావటంతో కాంగ్రెస్ సీనియర్ నేతలు మంగ మోహన్‌గౌడ్, మెదక్ మండల అధ్యక్షుడు శంకర్, పట్టణ అధ్యక్షుడు గూడూరి ఆంజనేయులు, ముత్యంగౌడ్ పదవి ఆశిస్తున్నారు.
- ➡ రామాయంపేట మార్కెట్ కమిటీ పదవీకాలం 2023 జూన్ 25తో ముగిసింది. ఎస్టీ రిజర్వుడు కావటంతో చిన్నశంకరంపేట సీనియర్ నేతలు సురేందర్‌నాయక్, మోహన్‌నాయక్, అశోక్‌నాయక్, నార్సింగి మండలానికి చెందిన రాజాసింగ్, నిజాంపేట మండలానికి చెందిన రాంచందర్‌నాయక్ ఆశిస్తున్నారు.
- ➡ పాపన్నపేట మార్కెట్ కమిటీ 2023 డిసెంబర్ 23న ముగిసింది. ఇది ఎస్సీ రిజర్వేషన్ కావడంతో వినోద్ అమృత్‌రావు, సూర్యరావు, క్రీస్తుదాసు, దుర్గేశ్ ఆశిస్తున్నారు.
- ➡ నర్సాపూర్ మార్కెట్ కమిటీ పదవీకాలం 2023 నవంబర్ 23న ముగిసింది. ఇది బీసీ రిజర్వుడు కావటంతో నర్సాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లేశ్, శివ్వంపేట మండల పార్టీ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ ఆశిస్తున్నారు.
- ➡ చేగుంట మార్కెట్ కమిటీ పాలకమండలి 2022 మే 12న ముగిసింది. ఇది ఓసీ రిజర్వేషన్ కావడంతో ఆ పార్టీ సీనియర్ నేత వెంగళరావు తాజా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రవీణ్ కుమార్ పోటీ పడుతున్నారు.
- ➡ తూప్రాన్‌లో మార్కెట్ కమిటీని ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటివరకు అక్కడ పాలక మండలిని ఏర్పాటు చేయలేదు. కాగా అది ఓసీ రిజర్వేషన్ కావటంతో అధికార పార్టీకి చెందిన సీనియర్ నేతలు భాస్కర్‌రెడ్డి, మల్లారెడ్డి పోటీ పడుతున్నారు.

కొత్త కిక్కు!

- మద్యం దుకాణాల లైసెన్స్‌ల జారీకి నోటిఫికేషన్
- 2025 డిసెంబర్ నుంచి 2027 నవంబర్ వరకు..
- ఈ ఏడాది నవంబర్‌తో ముగియనున్న గడువు
- గౌడ్‌లకు 15, ఎస్సీలకు 10, ఎస్టీలకు 5 శాతం రిజర్వేషన్
- జిల్లాలో 48 మద్యం దుకాణాలు

మెదక్ అర్బన్: మద్యం దుకాణాల లైసెన్స్‌లకు బుధవారం నోటిఫికేషన్ విడుదలైంది. దరఖాస్తు ఫీజును రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షలకు పెంచారు. 2025 డిసెంబర్ నుంచి 2027 నవంబర్ వరకు రెండేళ్ల పాటు వ్యాపారం చేసుకునేందుకు ఎక్సైజ్ పాలసీ ఖరారు అయ్యింది. ఈసారి గౌడ్‌లకు 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం రిజర్వేషన్లు కేటాయించారు. స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా మద్యం షాపుల లైసెన్స్‌లకు భారీ డిమాండ్ ఉండనుంది. జిల్లాలో 48 వైన్ షాపుల కోసం వేలాది దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది.

భారీగా పెరిగిన దరఖాస్తు ఫీజు

ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుగా మారిన ఎక్సైజ్ శాఖ టెండర్లపై వ్యాపారులు ఆసక్తిగా ఉన్నారు. రోజు రోజుకు మద్యం వినియోగం పెరుగుతుండటం.. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు వస్తాయన్న ఆశతో ఈసారి వైన్ షాపులకు భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది. గతంలో నవంబర్‌లో సాధారణ ఎన్నికల దృష్ట్యా ఆగస్టులోనే నోటిఫికేషన్ వేశారు. కొత్త షాపులు మాత్రం డిసెంబర్‌లో ప్రారంభం అయ్యాయి. అప్పట్లో జిల్లాలోని పోతంషెట్‌పల్లి వైన్ షాపుకు అత్యధికంగా 111 దరఖాస్తులు వచ్చాయి. అలాగే గతంతో పోలిస్తే ఈసారి లైసెన్స్ దరఖాస్తు ఫీజును కూడా రూ. 2 లక్షల నుంచి 3 లక్షలకు పెంచారు. ఇక వైన్ షాపుల కేటాయింపులో కూడా రిజర్వేషన్లు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా వైన్ షాపులను ఆరు స్లాబ్‌లుగా వర్గీకరించారు. 2011 జనాభా ఆధారంగా ఈ స్లాబ్‌లు విభజించారు. 5 వేల జనాభా వరకు రూ. 50 లక్షలు, 5 వేల నుంచి 50 వేల జనాభా వరకు రూ. 55 లక్షలు, 50 వేల నుంచి 1 లక్షా జనాభా వరకు రూ. 60 లక్షలు, లక్ష నుంచి 5 లక్షల జనాభా వరకు రూ. 65 లక్షలు, 5 లక్షల నుంచి 20 లక్షల జనాభా వరకు రూ. 85 లక్షలు, 20 లక్షలకు పైగా జనాభా ఉంటే రూ. 110 లక్షలు ఏడాది కాలానికి లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. జీహెచ్ఎంసీ పరిధిలోని వైన్‌షాపులు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు, ఇతర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు తెరిచి ఉంటాయి. ఈ విషయమై జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డిని 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.



స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి

జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వివేక్

చేగుంట(తూప్రాన్): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం వడియారంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్‌రెడ్డి ఏర్పాటుచేసిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదేళ్లు తెలంగాణను పాలించిన బీఆర్ఎస్ కమీషన్ల కోసమే మెగా ప్రాజెక్టులను నిర్మించిందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతర కృషి చేస్తుందన్నారు. రెండో విడతగా దుబ్బాక నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో రూ. 9 వేల కోట్లతో సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. అర్హులైన పేదలందరికీ 12 లక్షల రేషన్ కార్డులను అందించామని వివరించారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదన్నారు. రాష్ట్రానికి 7 లక్షల టన్నుల యూరియా రావాల్సి ఉండగా, 50 శాతం మాత్రమే వచ్చిందని, త్వరలోనే అందరికీ యూరియా అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈసందర్భంగా పలు మండలాలకు చెందిన వివిధ పార్టీల నాయకులను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పరమేశ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, నాయకులు పెంటారెడ్డి, విష్ణు, శ్రీకాంత్, రాజాగౌడ్‌తో పాటు పలు మండలాల నాయకులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

- 900 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉంది
- కలెక్టర్ రాహుల్‌రాజ్

పాపన్నపేట(మెదక్)/టేక్మాల్/అల్లాదుర్గం: యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దని, ప్రస్తుతం జిల్లాలో 900 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని లక్ష్మీనగర్‌లో ప్రధాన మంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. కొంతమంది యూరియా కొరత ఉందని వదంతులు సృష్టించడంతో రైతులు సెప్టెంబర్‌లో కొనాల్సిన యూరియాను ముందుగానే కొంటున్నారని తెలిపారు. అలాగే మండల కేంద్రమైన టేక్మాల్‌లో రైతు ఆగ్రోస్ కేంద్రాన్ని సందర్శించి యూరియా నిల్వలపై ఆరా తీశారు. 10 రోజుల్లో సుమారు 1,000 నుంచి 1,500ల మెట్రిక్ టన్నుల యూరియా అదనంగా వస్తుందని చెప్పారు. యూరియా వాడకంపై రైతుల్లో చైతన్యం తీసుకొచ్చిన వ్యవసాయాధికారి రాంప్రసాద్‌ను అభినందించారు. అనంతరం అల్లాదుర్గం మండలం బంటికుంట గండితో పాటు దెబ్బతిన్న చిల్వెర చెరువును కలెక్టర్ పరిశీలించారు. ధ్వంసమైన రోడ్లను పూర్తిస్థాయి విచారణ జరిపి మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు.

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

మెదక్ కలెక్టరేట్: గణేష్ నవరాత్రి ఉత్సవాలను జిల్లా ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ నగేశ్, అదనపు ఎస్పీ మహేందర్‌తో కలిసి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 27 నుంచి జరిగే గణేష్ ఉత్సవాలను అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు.



లక్ష్మీనగర్‌లో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఏమైనా ఇబ్బందులున్నాయా..?

ఖైదీలతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి

మెదక్ కలెక్టరేట్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ బుధవారం మెదక్ సబ్ జైలును ఆకస్మికంగా సందర్శించారు. ఖైదీలతో మాట్లాడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం ఎలా ఉంది.. అన్ని వసతులు కల్పిస్తున్నారా? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అంటూ ఆరా తీశారు. ఈసందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. మీరు తప్పులు చేసి జైలుకు వస్తే మీ కుటుంబాలు మానసిక క్షోభకు గురవుతాయన్నారు. ఒకసారి జైలు నుంచి బయటకు వెళ్లాక సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఆమె వెంట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ సుభవల్లి, జైలు సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి నీలిమ

వర్షాలకు దెబ్బతిన్న పంటలు

- జిల్లావ్యాప్తంగా 2,484 ఎకరాల్లో నష్టం
- ప్రభుత్వానికి నివేదిక పంపిన అధికారులు



హవేళిఘణాపూర్ మండలంలో దెబ్బతిన్న వరి పంట

మెదక్‌జోన్: వారం రోజులుగా జిల్లాలో కురుస్తు న్న భారీ వర్షాలకు వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ప్రధానంగా వరిలో ఇసుక మేట లు పేరుకుపోగా, పత్తి, ఇతర ఆరుతడి పంటలు ముంపునకు గురైనట్లు అధికారులు చెబుతున్నా రు. జిల్లా వ్యాప్తంగా వర్షాలకు 3,305 మంది రైతులకు సంబంధించి, ఇప్పటివరకు 2,484 ఎకరాల్లో పంటలు ధ్వంసం అయ్యాయి. ఇందులో ప్రధానంగా వరి 1,620 ఎకరాలు, పత్తి 687 ఎకరాల్లో దెబ్బతినగా, ఇతర ఆరుతడి పంటలు 177 ఎకరాలలో నష్టం జరిగింది. అత్యధికంగా పెద్దశంకరంపేట, టేక్మాల్, అల్లాదుర్గం, రేగోడ్ మండలాల్లో పత్తి పంటకు నష్టం జరగగా, పాపన్నపేట, మెదక్, శివ్వంపేట, కొల్చారం, హవేళిఘనాపూర్, చిన్నశంకరంపేట, చేగుంట మండలాల్లో వరితో పాటు ఇతర ఆరుతడి పంటలకు నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ నష్టం మరింత పెరిగే అవకాశం ఉందని, వరద ఉధృతి తగ్గే వరకు పూర్తిస్థాయిలో అంచనా వేయలేమంటున్నారు. కాగా పంట నష్టం వివరాలను ఎప్పటికప్పుడు రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపిస్తున్నామని పేర్కొన్నారు. కాగా పంటల బీమా లేక పోవడంతో ప్రభుత్వం ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ పైనే రైతులు ఆధారపడుతున్నారు. ప్రభుత్వం ఎకరాకు రూ. 10 వేల చొప్పున పరిహారం అందజేస్తుంది.



ఇబ్రహీంపూర్‌లో బారులు తీరిన రైతులు

అదే తీరు.. అదే లైను!



కౌడిపల్లిలో యూరియా టోకెన్ల కోసం రైతుల పడిగాపులు

చేగుంట మండలంలోని మక్కరాజిపేటలో బుధవారం యూరియా కోసం ఆందోళన నిర్వహించారు. యూరియా వస్తుందన్న సమాచారంతో సహకార సంఘం కార్యాలయం వద్దకు చేరుకున్నారు. సాయంత్రం వరకు వస్తుందని అధికారులు తెలపడంతో ఆగ్రహించి రాస్తారోకోకు దిగారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు రైతులకు నచ్చజెప్పి రాస్తారోకోను విరమింపజేశారు. ఇబ్రహీంపూర్‌లో యూరియా కోసం గంటల పాటు నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే కౌడిపల్లిలో యూరియా కోసం రైతులు పడిగాపులు కాశారు. భాగ్యలక్ష్మి ట్రేడర్స్‌కు 400బస్తాల యూరియా రావడంతో ఉదయం నుంచే టోకెన్ల కోసం రైతువేదిక వద్ద క్యూ కట్టారు. – చేగుంట(తూప్రాన్)/కౌడిపల్లి(నర్సాపూర్)

క్లుప్తంగా

అథ్లెటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ



క్రీడల్లో రాణించిన విద్యార్థులు

హవేళిఘణాపూర్(మెదక్): జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో భాగంగా హవేళిఘణాపూర్ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు హెచ్‌ఎం కరుణాకర్ తెలిపారు. రన్నింగ్ -600 మీటర్ల విభాగంలో ద్వితీయ స్థానంలో నవీన్, షాట్‌పుట్ అండర్-18 విభాగంలో ద్వితీయ స్థానంలో రోహిత్, అండర్ -14 విభాగంలో 60 మీటర్ల రన్నింగ్‌లో శైలజ తృతీయ స్థానంలో నిలిచారు. మెడల్స్ సాధించినందుకు పీడీ మధుమోహన్, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

కనీస వేతనాలు అమలు చేయాలి



సమస్యలు తెలుసుకుంటున్న యాదగిరి

హత్నూర(సంగారెడ్డి): కాంట్రాక్ట్ కార్మికుల శ్రమను దోచుకుంటున్న యాజమాన్యాలు కనీస వేతనాలు ఇవ్వడం లేదని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి అన్నారు. బుధవారం మండలంలోని వివిధ పరిశ్రమల వద్ద సర్వే నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పలు పరిశ్రమల్లో 10 నుంచి 12 గంటలు పని చేయించుకుంటున్నారని తెలిపారు. ఈఎస్ఐ, పీఎఫ్ ,యూనిఫామ్, మంచినీళ్లు , వాష్ రూమ్ తదితర సౌకర్యాలు ఏ పరిశ్రమ కూడా కల్పించడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వీరేశం, శేఖర్, మహేశ్, సురేశ్ ,ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత



ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్లు

జహీరాబాద్ టౌన్: అక్రమంగా తీసుకొస్తున్న మద్యం బాటిళ్లను ఎక్సైజ్ చెక్‌పోస్టు అధికారులు బుధవారం పట్టుకున్నారు. వివరాలు ఇలా.. రాష్ట్ర సరిహద్దులో గల మండలంలోని చిరాగ్‌పల్లి చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ ఎస్ఐ.కోటేశ్వర్ వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో వాహనాల్లో తరలిస్తున్న వివిధ బ్రాండ్స్‌కు చెందిన ఎనిమిది గోవా మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మద్యాన్ని జహీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. తనిఖీల్లో సూపరింటెండెంట్ నవీన్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం



గంజాయి, నిందితుడ్ని పట్టుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

మునిపల్లి(అందోల్): 65వ నంబర్ జాతీయ రహదారిపై ఎండు గంజాయిని పట్టుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ చంద్రశేఖర్ వివరాల ప్రకారం... బుధవారం మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో వాహనాలు తనిఖీ చేపట్టారు. కరీంనగర్‌కు చెందిన తాజ్ మహమ్మద్ కర్నాటక ఆర్టీసీ బస్సులో బీదర్ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా 440 గ్రాముల ఎండు గంజాయిని తీసుకొస్తుండగా పట్టుకున్నారు. గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని మహమ్మద్‌పై కేసు నమోదు చేసి సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. తనిఖీల్లో ఎస్ఐ అనిల్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్, అలీం , కానిస్టేబుల్ యాదయ్య, కరీం పాల్గొన్నారు.

అదుపు తప్పి కారు బోల్తా

- ఇద్దరికి తీవ్ర గాయాలు



రోడ్డుపక్కన బోల్తా పడిన కారు

జగదేవ్‌పూర్(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం... యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని పుట్టగూడెం గ్రామానికి చెందిన యాదవత్తు రవి తన కూతురిని కళాశాలలో దించి రావడానికి షిఫ్ట్ కారులో వెళుతున్నారు. దౌలాపూర్ గ్రామ సమీపంలోకి రాగానే కారు అదుపు తప్పి రోడ్డు కిందకు వెళ్లి బోల్తా పడింది. దీంతో రవితో పాటు కూతురికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.


సింగూరు నుంచి నీటి కేటాయింపులు ఇలా..

హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లయ్	మిషన్ భగీరథ తాగునీటి పథకానికి..	కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ ప్రాజెక్టుకు	ఘనపురం ఆనకట్టకు..	సింగూరు కాలువలకు
6.96 టీఎంసీలు	5.70 టీఎంసీలు	8.35 టీఎంసీలు	4.06 టీఎంసీలు	2.00 టీఎంసీలు

హైదరాబాద్‌కు తాగునీరెట్లా?

ప్రశ్నార్థకంగా మారిన ప్రత్యామ్నాయం.!

- సింగూరును ఖాళీ చేస్తున్న నీటి పారుదల శాఖ
- డెడ్ స్టోరేజీకి సర్కారుకు ప్రతిపాదనలు
- 16.5 టీఎంసీలకు తగ్గించేందుకు అనుమతి
- తక్షణమే ఖాళీ చేసి మరమ్మతులు చేయాలి : ఎన్‌డీఎస్‌ఏ



సింగూరు ప్రాజెక్టు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి : సింగూరు ప్రాజెక్టును ఖాళీ చేస్తే హైదరాబాద్‌కు తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయం ఎలా అనే అంశం తెరపైకి వస్తోంది. నగరానికి తాగునీటి సరఫరాలో ఈ జలాశయమే కీలకం. హెచ్‌ఎండబ్ల్యూఎస్ (హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లయ్) ఇక్కడి నుంచి ప్రతిరోజు 120 మిలియన్ గ్యాలెన్ల తాగునీరు హైదరాబాద్‌కు సరఫరా చేస్తోంది. నగరంలోని గచ్చిబౌలి, హైటెక్‌సిటీ, బంజారాహిల్స్, టోలీచౌక్ (పాక్షికంగా), హఫీజ్‌పేట్, హైదర్‌నగర్, లింగంపల్లి, రామచంద్రాపురం, పటాన్‌చెరుకు ప్రాంతాలకు ఇక్కడి నుంచే పంపింగ్ జరుగుతోంది. ఎన్‌డీఎస్‌ఏ హెచ్చరికల నేపథ్యంలో ఇప్పుడు ఈ ప్రాజెక్టును ఖాళీ చేస్తే ఈ ప్రాంతాలకు తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ప్రశ్నార్థకంగా మారాయని ఆ సంస్థ వర్గాలు పేర్కొంటున్నాయి.

డెడ్ స్టోరేజీ కోసం ప్రతిపాదనలు

ఈ జలాశయం కట్ట పూర్తిగా దెబ్బతిన్నదని డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) ఇటీవల హెచ్చరించిన సంగతి తెలిసిందే. తక్షణం కట్ట రివీట్‌మెంట్‌కు మరమ్మతులు చేయని పక్షంలో డ్యామ్ తెగిపోయి భారీ నష్టం వాటిల్లుతుందని నివేదిక ఇచ్చింది. ఈ హెచ్చరికల నేపథ్యంలో నీటిపారుదల శాఖ ప్రాజెక్టులోని నీటిని ఖాళీ చేస్తోంది. ఇటీవల కురిసిన వర్షంతో వచ్చిన వరదతోపాటు, ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీటిని కూడా దిగువకు వదిలేస్తోంది. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 29.9 టీఎంసీలు. వారం రోజుల క్రితం 22.2 టీఎంసీలు నీరు ఉండేది. ఇప్పుడు ఈ నీటి నిల్వను 18.6 టీఎంసీలకు తగ్గించారు. 16.55 టీఎంసీలకు తగ్గించేందుకు ఇప్పటికే ప్రభుత్వం నుంచి అనుమతి ఉంది. తాజాగా డెడ్ స్టోరేజీ (1.5 టీఎంసీల)కు తగ్గించేందుకు అనుమతి మంజూరు చేయాలని జిల్లా నీటి పారుదల శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రాజెక్టును డెడ్‌స్టోరేజీ చేసి రూ.16.08 కోట్లతో మరమ్మతు పనులు చేస్తామని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలపై ప్రభుత్వం నుంచి అనుమతి రావాల్సి ఉందని ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి.

మిషన్ భగీరథకు సైతం..

సంగారెడ్డితోపాటు, మెదక్ జిల్లాలో కొన్ని గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్న భగీరథ తాగునీటి పథకాలకు సింగూరు ప్రాజెక్టే ఆధారం. ఈ తాగునీటి పథకాల కోసం రోజుకు 120 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్ల తాగునీరు సరఫరా అవుతోంది. ప్రధానంగా సంగారెడ్డి, పటాన్‌చెరు, జహీరాబాద్, అందోల్, నారాయణఖేడ్ నియోజకవర్గాలతోపాటు, మెదక్ జిల్లాల్లో కొన్ని గ్రామాలకు ఈ ప్రాజెక్టు నుంచి తాగునీటి సరఫరా జరుగుతోంది. ప్రాజెక్టును ఖాళీ చేస్తే పాత తాగునీటి పథకాలతోపాటు, బోర్లే ఆధారం కానున్నాయి.

నూతన చట్టాలపై అవగాహన అవసరం

జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



ట్రైనింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

సంగారెడ్డి జోన్: రిఫ్రెష్మెంట్ కోర్సులో భాగంగా జిల్లా నుంచి వచ్చే సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలని ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. బుధవారం జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌ను ఆయన సందర్శించి, బ్యారెక్స్, తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బందికి నాణ్యమైన శిక్షణ అందించేలా నూతన చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. డ్రిల్ ప్రాక్టీస్, రెగ్యులర్ పరేడ్‌లో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఫిజికల్ ట్రైనింగ్, లా క్లాస్‌లను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీసీ ప్రిన్సిపాల్, అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ సురేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ క్లాసులను సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేట జిల్లా డీఐఈఓ రవీందర్ రెడ్డి



డిజిటల్ క్లాస్‌లను పరిశీలిస్తున్న డీఐఈవో

సిద్దిపేట ఎడ్యుకేషన్ : జేఈఈ, నీట్, ఈఏపీసెట్ ఎంట్రెన్స్‌లకు హాజరయ్యే విద్యార్థులు ఫిజిక్స్ వాలా ఆన్‌లైన్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. బుధవారం ఆయన ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను సందర్శించి ఆన్‌లైన్ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోజు వారి తరగతులతో పాటు, ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలని అధ్యాపకులను ఆదేశించారు. డిజిటల్ క్లాస్‌లను సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

మా హయాంలో యూరియా కొరత లేదు

చేర్యాల కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే పల్లా



ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు, నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): కేసీఆర్ పాలనలో రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోలేదని, ముందుచూపుతో యూరియా కొరత లేకుండా చేశారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి గుర్తు చేశారు. కొద్ది రోజుల క్రితం ఆయన కాలుకు గాయం కావడంతో శస్త్ర చికిత్స చేయించుకుని నయం అయిన వెంటనే బుధవారం కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చారు. ఆయనకు కార్యకర్తలు కొమురవెల్లి పాత కమాన్ వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం ర్యాలీగా ఆలయం వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చేర్యాల పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో రిజర్వాయర్లను ఎప్పటికప్పుడు నింపి రైతులకు నీరు అందించామని తెలిపారు. కాళేశ్వరం రిజర్వాయర్‌పై జస్టిస్ ఘోష్ ఇచ్చిన నివేదికను కాంగ్రెస్ ప్రభుత్వం పచ్చి అబద్ధంగా ప్రచారం చేస్తూ కేసీఆర్, హరీశ్‌రావులపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రపంచంలోనే ఎత్తైన, తక్కువ సమయంలో పూర్తి చేసిన కాళేశ్వరం రిజర్వాయర్ రెండు పిల్లర్లు కుంగితే వాటిని బాగు చేసి రైతులకు నీరు అందిచాల్సింది పోయి, విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణంపై వివాదం

ఇరువర్గాల మధ్య తోపులాట

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని కృష్ణాపూర్‌లో పీఏసీఎస్ భవనం చుట్టు ప్రహరీ గోడ నిర్మాణం విషయమై బుధవారం వివాదం నెలకొంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య తోపులాట జరిగింది. వివరాలు ఇలా... పీఏసీఎస్‌లో ఉన్నా నిధులతో గోడ నిర్మాణ పనులు చేపట్టేందుకు చైర్మన్ కృష్ణాగౌడ్ ఆధ్వర్యంలో భూమి పూజ చేస్తుండగా కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. నిధులు దుర్వినియోగం జరగకుండా పనులు చేపట్టవద్దని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇటీవల గ్రామస్తులు జిల్లా అధికారులకు విన్నవించారు. పనులు చేపట్టవద్దని జిల్లా సహకార అధికారి కిరణ్‌కుమార్ ఉత్తర్వులు సైతం జారీ చేశారు. భూమి పూజ చేస్తుండగా కాంగ్రెస్ నాయకులు, కొందరు గ్రామస్తులు అక్కడికి చేరుకోగా వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు అక్కడికి చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టారు. జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో ప్రహరీ గోడ నిర్మాణం పనులకు బ్రేక్ పడింది.

పుస్తెలతాడు చోరీకి యత్నం

సిద్దిపేటకమాన్: మహిళ మెడలో నుంచి బంగారు పుస్తెలతాడు చోరీకి యత్నించిన ఘటన సిద్దిపేట పట్టణ శివారులో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన అప్పిస యాదవ్వ (38) స్థానిక శ్రీ కృష్ణాయాదవ ఫంక్షన్‌హాల్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తోంది. రోజు మాదిరిగానే ఆమె మంగళవారం రాత్రి విధుల్లో ఉండగా గుర్తు తెలియని వ్యక్తి లోపలికి వచ్చి మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడు దోచుకెళ్లడానికి ప్రయత్నించాడు. దీంతో అప్రమత్తమై ఆమె కేకలు వేయగా పక్కనే ఉన్న మరో ఫంక్షన్ హాల్ వాచ్‌మెన్ వచ్చి దుండగుడిని పట్టుకునే ప్రయత్నం చేయగా పారిపోయాడు. ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

హుండీని ఎత్తుకెళ్లిన దుండగులు

రామాయంపేట(మెదక్): పట్టణంలోని మల్లన్న గుడిలో దుండగులు మంగళవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం తాళాలు పగులగొట్టి హుండీని ఎత్తుకెళ్లారు. అందులో సుమారుగా రూ. ఐదు వేలు నగదు ఉందని నిర్వాహకులు ఎస్ఐ బాల్‌రాజ్‌కు తెలిపారు. సీసీ కెమెరాలో నిందితులకు సంబంధించి ఆనవాళ్లు నమోదయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, త్వరలో నిందితులను అరెస్ట్ చేస్తామని ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



తాజుద్దీన్

రామచంద్రాపురం(పటాన్ చెరు): వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కేసీఆర్‌నగర్‌లో నివాసముండే షేక్ తాజుద్దీన్ కొంతకాలం ఏ పని చేయకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ విషయంలో భార్యాభర్తల మధ్య అప్పుడప్పుడు చిన్న చిన్న గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయంపై గతంలో పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. కాగా ఈ నెల 18న ఎవరికీ చెప్పకుండా తాజుద్దీన్ ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ రావడంతో అతని ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఫలితం లేదు. అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎస్టీయూటీఎస్ ఉద్యమ బాట

మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో విఫలమైందని ఎస్టీయూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్ ఆరోపించారు. అక్టోబర్ 12న లక్ష మందితో ఛలో హైదరాబాద్ పేరిట 'జంగ్ సైరన్' నిర్వహించనున్న మహాధర్నాకు సంబంధించి బుధవారం మెదక్‌లో సన్నాహక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్ గౌడ్, కిష్టయ్య, జబ్బార్, అరుణ్, దిలీప్, వేణుగోపాల్, మహేశ్వర్, ఎల్లం, రవి, రావినాయక్, మల్లేశ్, శ్రీధర్, దుర్గారాములు పాల్గొన్నారు.

కూలిన పాఠశాల ప్రహరీ గోడ

- తప్పిన ప్రమాదం



కూలిన దొడ్లపల్లి పాఠశాల ప్రహరీ గోడ

దుబ్బాకటౌన్: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాయపోల్ మండలం దొడ్లపల్లి ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ బుధవారం కూలిపోయింది. కూలినప్పుడు సమీపంలో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రహరీ గోడ లేకపోతే పాఠశాలకు రక్షణ లేకుండా పోతుందని, చుట్టుప్రక్కల వ్యవసాయ పొలాలు ఉండటంతో క్రిమి కీటకాలు, పాములు లోనికి వచ్చే అవకాశముందని తల్లిదండ్రులు భయందోళనకు గురవుతున్నారు. వెంటనే ప్రభుత్వం శిథిలాలను తొలగించి గోడను నిర్మించాలని కోరుతున్నారు.



మట్టిరోడ్డు పై గుంతలో నీరు నిలువడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

ఖాజీపేట తండాకు రాకపోకలు బంద్

- వర్షంతో కొట్టుకుపోయిన మట్టి రోడ్డు
- ఐదు రోజులుగా గిరిజనులకు ఇబ్బందులు



కోతకు గురైన ఖాజీపేట గిరిజన తండా రోడ్డు

నర్సాపూర్ రూరల్: మండలంలోని ఖాజీపేట గిరిజన తండాకు ఐదో రోజులుగా రాకపోకలు బంద్ అయ్యాయి. భారీ వర్షాలతో తండాకు వెళ్లే మట్టిరోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. రెడ్డిపల్లి - ఖాజీపేట టీడబ్ల్యూ రోడ్డు నుంచి గిరిజన తండా వరకు సుమారు మూడు కిలోమీటర్లు మట్టి రోడ్డు ఉంది. ఈ రోడ్డు పక్క నుండి కాళేశ్వరం ప్రాజెక్టు కాలువ ఉండటంతో పాటు మరోపక్క వాగు ఉండటంతో వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్డు కోతలకు గురైంది. దీంతో స్కూల్ పిల్లలతో పాటు గిరిజనులు నిత్యావసర సరుకులు, ఆస్పత్రులకు వెళ్లాలంటే నరకయాతన పడుతున్నారు. కాళేశ్వరం కాలువతోనే తమ రోడ్డు కుంగిపోయి గుంతలు ఏర్పడుతున్నాయని తండా గిరిజనలు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై కాళేశ్వరం ఏఈ డబ్ల్యూఓ. సుజాతరాణిని వివరణ కోరగా తండా రోడ్డుకు మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

సాగుపై క్షేత్రస్థాయిలో విద్యార్థుల పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న విద్యార్థులు

హత్నూర (సంగారెడ్డి): మండలంలోని పన్యాల గ్రామంలో క్షేత్రస్థాయిలో వ్యవసాయ సాగును రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు బుధవారం పరిశీలించారు. గ్రామీణ కృషి అనుభవం కారక్రమంలో భాగంగా విద్యార్థులు వంశీ, మణికంఠ, సాయి శివనాథ్, అనిల్ గ్రామీణ వ్యవసాయ భాగస్వామ్య విశ్లేషణ కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్తలు డా. అరుణ, డా.రాహుల్, డా.నిర్మల పాల్గొన్నారు. విద్యార్థులు గ్రామంలో పర్యటించి రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సమస్యలను గ్రామ పటం, చిత్రాల రూపంలో ప్రదర్శించారు. రైతులు టి.బుచ్చి రెడ్డి, డి.విఠల్, బషీర్, శ్రీనివాస్ రెడ్డి, ఏఈఓ రమేశ్, గ్రామ కార్యదర్శి శ్వేత, స్థానికులు అరుణ్ కాంత్ రెడ్డి, సతీశ్, శంకర్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

పురాతన భవనం కూల్చివేత



పురాతన భవనాన్ని కూల్చివేస్తున్న జేసీబీ

ఝరాసంగం(జహీరాబాద్): మండల కేంద్రంలో సుమారు 150 సంవత్సరాల క్రితం ఝరాసంగం శ్రీ కేతకీ సంగమేశ్వర ఆలయ ఆవరణలో నిర్మించిన పురాతన భవనం శిథిలావస్థకు చేరడంతో కూల్చివేశారు. కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు భవనం ఓ పక్క కూలిపోవడంతో ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామపంచాయతీ అధికారుల ఆదేశాలతో భవన యజమాని కూల్చివేత పనులు ప్రారంభించారు. కొన్ని ఏళ్ల పాటు ఓ వైపు కుటుంబం నివాసం ఉండటంతో పాటు అప్పట్లో పోలీస్ స్టేషన్, ఆ తర్వాత బీసీ సంక్షేమ వసతి గృహం కొనసాగింది. అనంతరం సినిమా ప్రదర్శనలతోపాటు ప్రైవేటు కార్యాలయం ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు పోషకాహారం ఇవ్వాలి

దిగ్వాల్‌లో పర్యటించిన పంజాబ్ ఆహార కమిషన్ బృందం



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పంజాబ్ కమిషన్ చైర్మన్ బాలముకుంద్ శర్మ

జహీరాబాద్: విద్యార్థులకు తగిన పోషకాహారం ఇవ్వాలని, అప్పుడే ఆరోగ్య ఇండియాను తయారు చేసిన వారం అవుతామని పంజాబ్ రాష్ట్ర ఆహార కమిషన్ బృందం పేర్కొంది. బుధవారం కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామాన్ని బుధవారం సందర్శించారు. పంజాబ్ కమిషన్ చైర్మన్ బాల్‌ముకుంద్ శర్మ, తెలంగాణ రాష్ట్ర కమిషన్ చైర్మన్ మెంబర్ ఆనంద్‌తో కలిసి పర్యటించారు. దిగ్వాల్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అక్షయపాత్ర ఆహారం, గ్రుడ్లు సక్రమంగా ఇస్తున్నదీ లేనిది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల నిర్వహణ తీరుపై ఎంఈఓ జాకీర్ హుస్సేన్‌ను అభినందించారు. అనంతరం రేషన్ దుకాణం, గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి మహిళలతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఆయా రాష్ట్రాల ఫుడ్ కమిషన్ సభ్యులు, నవల్‌కిశోర్ శర్మ, జ్యోతి, విజయ్‌దత్, చేతన్ ప్రకాశ్‌దలివాల్, జశ్వీర్ సింగ్, డీఈఓ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, డీఎండబ్ల్యూఓ దేవూజీ, డీసీఓ లక్ష్మి, డీసీఎస్ఓ బాలసరోజ, డీడబ్ల్యూఓ లలితకుమారి, డీఎంహెచ్ఓ నాగనిర్మల తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తూప్రాన్: ఆత్మహత్యకు యత్నించిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్ఐ శివానందం వివరాల ప్రకారం... పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన గజ్జెల సంధ్య(34) కుటుంబ పోషణ భారం కావడంతో మానసికంగా బాధపడుతూ ఈనెల 13న ఇంట్లో ఎవరు లేని సమయంలో ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. కాగా మృతురాలి భర్త ఇటీవల అప్పుల బాధతో ఉరివేసుకొని మృతి చెందాడు. దీంతో ఇద్దరు కుమారులు అనాథలయ్యారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు..

జిన్నారం (పటాన్‌చెరు): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి వివరాల ప్రకారం... బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని బీసీ కాలనీకి చెందిన గొల్ల శ్రీకాంత్ (27) స్వస్థలం మెదక్ జిల్లా హనుమంతాపూర్. సోమవారం తన స్నేహితులు ప్రకాశ్, బబ్లూతో కలిసి ఇంటి నుండి బయటకు వెళ్లారు. సాయంత్రం తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు శ్రీకాంత్ ఇంటికి రాకపోవడంతో స్నేహితులను అడగగా మాకు తెలియదని చెప్పారు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం నారాయణ కాళాశాల వెనుక భాగంలోని గుంతలో అనుమానాస్పద స్థితిలో ఓ శవం లభ్యమైంది. పోలీసులు శ్రీకాంత్‌గా గుర్తించారు. తన తమ్ముడి మృతికి స్నేహితులే కారణమని అన్న రమేశ్ అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

యూరియాకు ప్రత్యామ్నాయం 'నానో'

- చీడపీడల సమస్య ఉండదు
- అధిక దిగుబడి
- రైతులకు అవగాహన కల్పించిన అధికారులు

రామాయంపేట(మెదక్)/నర్సాపూర్‌రూరల్: నానో యూరియాతో అధిక లాభాలున్నాయని స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకులు రాజ్‌నారాయణ, నర్సాపూర్ వ్యవసాయ శాఖ ఏడీఏ సంధ్యారాణి, ఏఓ దీపిక పేర్కొన్నారు. బుధవారం రామాయంపేటలో పలు వ్యవసాయ క్షేత్రాలు, నర్సాపూర్ మండలంలోని లింగాపూర్‌లో నానో యూరియాపై వారు రైతులకు అవగాహన కల్పించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన ఐదు వందల మిల్లీ లీటర్ల నానో యూరియా, ఒక బస్తా యూరియాతో సమానమని తెలిపారు. ప్రస్తుతం వరి పంట పిలకల దశలో ఉందని, ఈ దశలో నానో యూరియా ద్రావణం పిచికారీ చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. సంప్రదాయ గుళికల రూపంలో ఉండే యూరియాను పంట చేనులకు వాడితే కేవలం 30 శాతం మాత్రమే మొక్క స్వీకరించే అవకాశం ఉందని, మిగతా 70 శాతం వృథాగా పోతుందని చెప్పారు. పంటలకు అధిక మోతాదులో యూరియా వాడితే చేన్లలో చీడపీడల సమస్య ఏర్పడుతుందని, దిగుబడిపై ప్రభావం చూపుతుందని తెలిపారు. నానో యూరియా చిన్న చిన్న కణాలుగా విభజింపబడి నేరుగా మొక్కల పత్ర రంధ్రాల్లోకి వెళుతుందని, దీంతో వేసిన ఎరువులో 80 శాతం మేర మొక్కకు అందుతుందని అధికారులు పేర్కొన్నారు. ప్రతి పంట సీజన్‌లో నానో యూరియాను రెండు సార్లు వాడాలన్నారు. ఒక లీటర్ నీటికి 2 నుంచి 4 మిల్లి లీటర్ నానో యూరియా పిచికారీ చేయాలని సూచించారు. పంట విత్తిన 25 నుంచి 30 రోజుల తర్వాత మొదటిసారి, పంట పూతకు వచ్చే సమయంలో మరోసారి పిచికారీ చేయాలన్నారు. వరి, గోధుమ, పత్తి, మొక్కజొన్న, కూరగాయలు, అప్పు దినుసులు, నూనె గింజల పంటలకు బాగా పని చేస్తుందన్నారు. ప్రతి రైతు యూరియాకు బదులు నానో యూరియాను వినియోగించి అధిక లాభాలు సాధించాలని రైతులకు అవగాన కల్పించారు.



నర్సాపూర్‌రూరల్: లింగాపూర్‌లో రైతు శంకర్ పొలంలో నానో యూరియా పిచికారీ చేయించి అవగాహన కల్పిస్తున్న అధికారులు